# ఆశ

['ఆశ ఫలించి అదృష్టం వరించే వేళకి అసువులు కోల్పోయిన నిర్భాగ్యుని కథ.']

♦

భక్తులారా రేపు సీతాకల్యాణం చెప్తాను. త్వరగా విచ్చేయండి...అన్న హరిదాసు మాట పూర్తికాకుండానే లేచిపోయి గబగబ నడవసాగేరు భక్తులందరూ. 'అమ్మా కళ్ళులేవు ధర్మం చేయండి గుడ్డోళ్ళమమ్మా' అని అరచే గుడ్డివాళ్ళమీద కుంటివాళ్ళమీద విసుక్కుంటూ వెళ్ళిపోతున్న జనంవైపు చూస్తూ అచేతనంగా కూర్చుండిపోయాడు కుంటి నర్సయ్య. పొద్దుటనుంచి వచ్చిన డబ్బులు మరొక్కసారి తనివితీర లెక్కపెట్టాడు నలభై ఏడు పైసలు. దీనితో తనకి రెండు పూటలు గడిచిపోతాయి హాయిగా. ఎవరో పడేసిన ఐదు పైసల శబ్దంతో తుళ్ళిపడి దాన్ని తీసుకొన్నాడు కుంటి నర్సయ్య. మెల్లగా కర్రల సాయంతో నించున్నాడు. మెల్లగా రోడ్డంట నడవటం మొదలుపెట్టాడు ఎప్పుడూ బేరాలు రాని బట్టలు కొట్టు, ట్యూబ్ లైట్లతో మెరిసిపోయే కిళ్ళీ కొట్టు, పోటీలు పడి పెట్టిన రెండు మందుల షాపులు



శ్రీ పద్మనాభం

దాటి అప్పిగాడి కాకా హోటల్ ముందు ఆగి టీ తాగి మళ్ళీ గుడికి బయలుదేరాడు. అక్కడికి వెళ్ళిన తర్వాత మూట తలకింద పెట్టి పడుకొన్నాడు. రోజూ నర్సయ్య చేసే పనే అది. సాయంత్రం హరికథకు వచ్చిన భక్తుల ధర్మమే నర్సయ్య జీవనోపాధి.

ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు నర్సయ్యకి. మొదటి ఆట సినిమా వదిలారు. నర్సయ్య ఆలోచిస్తున్నాడు. దూరంగా లాటరీ టిక్కట్లమ్మేవాడి కేకలు వినబడుతున్నాయి. 'రండి! రండి! త్వరపడండి! ఒక్క టిక్కట్టుకొని మీ అదృష్టాన్ని పరీక్షించండి. లక్షలు గెలవండి ఐదు లక్షలు గెలవండి. విజయవాడలో హోటల్ సర్వర్‌కు వచ్చిందండీ మీకూ రావచ్చండీ... తర్వాత మాటలు నర్సయ్యకి వినబడలేదు. ఎలాగైనా ఒక్క లాటరీ టిక్కట్టు కొనాలి. వెంటనే లేచి కర్రల సాయంతో లాటరీ రిక్షాదగ్గరకెళ్ళి 'టిక్కట్టెంత బాబూ!' అని అడిగాడు. 'రూపాయి' నర్సయ్యలో దృఢనిశ్చయం ఏర్పడింది. ఎలాగైనా టిక్కట్టు కొనాలి లక్షాధికారి అవ్వాలి. అంతకుముందు నర్సయ్య బాగా బతికినవాడే. కానీ విధి వైపరీత్యంవల్ల కాలు పోగొట్టుకొని నిరాశ్రయుడయ్యాడు. ఎంత వద్దనుకొన్నా గతం గుర్తుకొస్తోంది నర్సయ్యకు.

♦ ♦ ♦ ♦

ఆరోజు ఉదయం భూపతి నర్సయ్యను పిలిచి 'ఒరేయ్ నర్సిగా! జాగ్రత్త సరుకు రేపు తెల్లారేలోగా చేర్చాలి ఎక్కడికో తెల్సుగా! లారీలో ఫుల్‌గా పెట్రోలుంది. తెల్సిందా జాగ్రత్త' అన్నాడు. 'అలాగే బాబూ నాకు తెల్దా ఏటి మీరు మరీను...మరి,...నాకు...అంటూ నసిగాడు.' సరే అందాకా యీ వంద ఉంచు. వచ్చిన తర్వాత మిగతాది చూద్దాం. రామిగాడ్ని తోడు తీసికెళ్ళు' అన్నాడు. నర్సయ్యకు యిదేం కొత్తకాదు.

రాత్రిదాకా సరదాగానే గడిచింది ప్రయాణం. నర్సయ్య గళ్ళ చొక్కా జేబులో వంద రూపాయలు బరువుగా తగుల్తున్నాయి. స్టీరింగు పట్టుకొన్నా మాటి మాటికీ జేబు తడుముకుంటున్నాడు. చిన్న రాగం తీస్తున్నాడు. పక్కనే కూర్చొన్న నర్సిగాడు హుషారుగా ఉండటం చూసి రామిగాడు 'ఏటి గురో! మాంచి ఖులాసాగున్నావు. కాస్త సుక్కేసుకుందామేటి?' అన్నాడో లేదో లారీ ఆగింది. ఇద్దరు కల్లుపాక దగ్గరకెళ్ళి కడుపునిండ పట్టించేశారు. తూలుతూ వచ్చి స్టీరింగు ముందు కూర్చున్నాడు నర్సయ్య. రామిగాడు పాక పక్కనే కాలవపక్క దొర్లుతున్నాడని తెలియక నిషాలో ఏదో వాగేస్తూనే లారీ స్టార్ట్ చేశాడు. హాయుమనే వేగాలతో పోతోంది లారీ. నిషాలో రాగం తీస్తున్న నర్సయ్యకు, రోడ్డుకి అడ్డంగా ఉన్న రైల్వేగేటు

గానీ, రైలు వెళ్లడంగానీ, ఎర్ర లైటుగానీ, అరుస్తున్న గేటుకీపర్ గానీ కనబడడంలేదు.

అంతే... నాలుగు రోజుల తర్వాత తెలివి వచ్చేసరికి గవర్నమెంటు ఆస్పత్రిలో ఉన్నాడు. కుడికాలు బరువుగా ఉంది. మంచానికి కట్టేసినట్టుగా ఉంది. జేబులు తడుముకున్నాడు అలవాటు ప్రకారం. ఖాళీగా తగిలాయి. కాలు బాధగా ఉంటే చేతితో తడిమి అదిరిపోయాడు. గట్టిగా అరిచాడు. డ్యూటీ నర్స్ వచ్చి అరవకుండా పడుకోమని మందలించి వెళ్లిపోయింది. తర్వాత తెల్సింది తన కుడికాలు ఆక్సిడెంటులో పోయిందని భూపతిని అరెస్టుచేశారని. ప్రాణం పోయినా బాగుండుననుకొన్నాడు, భూపతికి తన ముఖం చూపలేక హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయిన వెంటనే బస్సు స్టాండుకి వెళ్లాడు. దూరంగా పారిపోదామని: తర్వాత ఈ ముష్టి బ్రతుకులో స్థిరపడిపోయాడు.

♦ ♦ ♦ ♦

మామూలుగా తెల్లవారింది లోకానికి. నర్సయ్యకు మాత్రం ఉత్సాహభరితోదయమది. హుషారుగా రోడ్డంట నడుస్తూ కనబడిన వాళ్ళందరినీ అడిగాడు. సాయంత్రం హరికథ ప్రారంభించే సమయానికి గుడికి చేరుకొన్నాడు. తన స్థలంలో అంటే రెండో మెట్టుమీద కూర్చొని ఒక్కసారి డబ్బులు లెక్కపెట్టాడు. ఎనభై తొమ్మిది పైసలు. హరికథ అయిపోయింది. రోజూకంటె బిగ్గరగా అరవసాగేడు. 'అమ్మా! బాబూ! కుంటోడ్ని ధర్మం చేయండి' వినుకొన్నవాళ్లు వినుక్కున్నారు. జాలిపడ్డవాళ్లు జాలిపడ్డారు. ఎవరో పది పైసల బిళ్ళ విసిరారు. నర్సయ్య ఆత్రంగా తీసుకొన్నాడు తనముందు పడిన ఆ పది పైసల్ని. పదీక్షగా చూశాడు. దానిలాగే తన బ్రతుకు ఎన్నో వంకలు తిరిగింది. మరో మూడు పైసలు, రెండు పైసలు పడ్డాయి. ఇంకేం... నర్సయ్య ఉత్సాహం పట్టలేకపోయాడు గబగబా లాటరీ రిక్షా దగ్గరికెళ్లాడు. 'బాబూ! నాక్కూడా ఒక టిక్కెట్టు యిప్పించు బాబూ!' అన్నాడు.. ఒక్కసారి అసహ్యంగా చూసి టిక్కెట్టు చింపి యిచ్చాడు. చిల్లర పైసలు రూపాయీ చేతిలో పోసి వెనుదిరిగాడు.

♦ ♦ ♦ ♦

రోజులు గడిచాయి. వారాలు గడిచాయి. రోజూ రిక్షా దగ్గరికి నర్సయ్య వెళ్లి కనుక్కొని వచ్చేవాడు. నర్సయ్య ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. రిక్షాలో

రచన:

శ్రీ ఆదూరి హేమశంకర్

నోటి ముందు మైకు పెట్టుకొని అరుస్తూ పేపరు చేత్తో పట్టుకు కూర్చొన్నా అతని దగ్గరికెళ్లి ఆశగా టిక్కెట్టు అందించాడు నర్సయ్య. నలిగిపోయి శిథిలావస్థలోనున్న ఆ టిక్కెట్టులోని నంబరు చూసి అతని ముఖం చేటంత అయింది. వెంటనే నర్సయ్యను వాటేసుకొని 'అదృష్టవంతుడివి! 5 లక్షలు గెలిచావు! ఐదు లక్షలకు అధికారివి ఇప్పుడు వెళ్ళిరా!...నన్ను, నా మాటా మర్చిపోకు' అన్నాడు.

నర్సయ్య ఆనందానికి పట్టపగ్గాలు లేవు. ఆఖరిసారిగా గుడి మెట్లపై కూర్చోడానికి ఆత్రంగా రోడ్డుకి అడ్డంగా పరిగెడుతున్న నర్సయ్యకు ఎదురుగా వస్తున్న ఎర్ర లారీ కన్పించలేదు. మరుక్షణం లారీ ముందు చక్రాలు నర్సయ్య ఎడం కాలిమీదుగా పొట్టనుదాటి కీచుమంటూ ఆగాయి. అందరూ గుమిగూడి 'పాపం' అన్నారు. ఉత్సాహంగా టిక్కెట్లు అమ్ముతున్న లాటరీవాడుకూడా వచ్చి జనాన్ని తోసుకుంటూ ముందుకు వచ్చి నిశ్చేష్టుడయ్యాడు.



శ్రీ రాజాబాబు